# పెళ్ళి ఇంటర్వ్యూ ★

రచన :
శ్రీ రేగులపాటి కిషన్ రావు

అతని పేరు ప్రకాశం! లా పాసయ్యాడు. అతని తండ్రి ఎం.ఎల్.ఏ.గా వుండి దేశసేవ చేశాడు లోగడ. పత్రికలో ప్రకటన ఇచ్చాడు.

'నా పేరు ప్రకాశం. వృత్తిరీత్యా న్యాయవాదిని. వరకట్నం తీసుకోకుండా తల్లిదండ్రులు లేని దిక్కులేని అమ్మాయిని పెళ్ళిచేసుకొని సంఘసేవ చేయాలనుకొంటున్నాను. నన్ను వివాహం చేసుకొనుటకు ఇష్టపడువారు. ఆదివారంనాడు నా ఇంటివద్ద జరుగు ఇంటర్వ్యూకు హాజర్ కావలయును' అడ్రసు క్రింద ఇవ్వబడింది.

ప్రకటన చూచి దిక్కులేని అమ్మాయిలు దిక్కులేనంతమంది వచ్చారు లాయర్ ప్రకాశం దగ్గరికి. వాళ్ళందరినీ హాల్లో కూర్చుండమన్నాడు.

'ఇంతమందిలో ఎవరిని ఎన్నుకొని పెళ్ళిచేసుకుంటాడో ఎవరో ఆ అదృష్టవంతురాలు' అనుకున్నారు దిక్కులేని అమ్మాయిలు.

లాయర్ ప్రకాశం ఇంటర్వ్యూ ప్రారంభించాడు.

ప్రకాశంవున్న గదిలోకి ఓ అమ్మాయి వచ్చింది. ఆమె ముఖం అందంగా వుంది. ఆమె శరీరంమీది బట్టలు అందంగా లేవు. ప్రకాశంను చూడగానే ఆమె చిరునవ్వు నవ్వింది. ప్రకాశం లాయర్‌లా నవ్వాడు.

'పేరేమిటి?'

ఆ అమ్మాయి దిక్కులు చూసింది.

'నిన్నే' పెద్ద కంఠంతో అన్నాడు లాయర్.

ఆ అమ్మాయి తన పేరు అడ్రసువున్న కాగితం ప్రకాశం ముందు టేబుల్ మీద పెట్టింది.

'మాటలు రావా? పేరు చెప్పమంటే చెప్పవేం' అన్నాడు లాయర్.

'నా...నా...నా పేరు సు...సు...సుందరి' చెప్పేసి నవ్వింది సుందరి.

'అందమైన ఓ నత్తి సుందరీ నిజంగా నువ్వు చాలా దురదృష్టవంతురాలవు' అనుకున్నాడు మనసులో. అదే క్షణంలో అతనికేవో సంఘసేవా భావాలు జ్ఞప్తికి వచ్చాయి. వెంటనే అడిగాడు 'నీకు తల్లితండ్రులు లేరా?'

'లే...లేరు.'

'ఎవరిదగ్గర పెరిగావు?'

'అ...అ...అనాథశ...శ...శరణాలయంలో'

అతడా అమ్మాయిని జాలిగా చూచి 'ఇక నువ్వు వెళ్ళొచ్చు' అన్నాడు.

'న...న...నన్ను పె...పెళ్ళి చే...చేసుకుంటారా మీరు?' లాయర్ నవ్వాడు. ఆమె కేమర్థమయిందో కాని ఆమె కూడా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది బయటకు.

'నెక్ట్'

మరో అమ్మాయి లోనికి ప్రవేశించింది.

ఆమె అందంగా లేదు. ఆమె ధరించిన బట్టలు అందగా వున్నాయి.

'నీకు తల్లిదండ్రులు లేరా?' ఆ అమ్మాయి లోనికి వస్తుండగానే అడిగాడు.

'లేరు' శ్రావ్యంగా వుంది కంఠధ్వని,

'పాటలు పాడొచ్చా?'

'పాడగలను'

'ఎవరు పెంచారు నిన్ను?'

'మా మామయ్య పెళ్ళాం'

'మీ మామయ్య ఏం పని చేస్తుంటాడు?'

'తాలూకాఫీసులో గుమాస్తా'

'నీ పేరు చెప్పావు కాదు'

'మీరు అడగలేదే!'

'పోనీ ఇప్పుడు చెప్పు'

'రాణి'

---

లేదు ఆనందరావుకు. గట్టిగా కండ్లుమూసుకొని ఒక్కసారి జుట్టు పీక్కున్నాడు.

"వరించని దేవతను గురించి విలపించడమెందుకండి. కూరా అన్నం తయారయినవి. స్నానంచేసిరండి భోజనంచేద్దాం" ఆనందరావు పిచ్చితనానికి మనసులో మదనపడుతూ – బాధపడుతున్న భర్తను ప్రేమతో ఓదార్చింది లక్ష్మి.

చాలా చక్కని పేరు. మరి ఏమైనా చదువుకున్నావా?

'ఇంటర్ పాసయ్యాను'

'చాలా సంతోషం. అన్నట్టు ఆభరణాలు ధరించడమంటే ఇష్టమేనా నీకు?'

'ఇష్టమంటే మాత్రం ఏం లాభం. అవి చేయించుకునే ఆర్థిక స్థోమత లేనప్పుడు' లాయర్ మౌనం వహించాడు.

రాణి తన పేరు అడ్రసు వ్రాసి ఆ కాగితాన్ని టేబుల్ మీద పెట్టి అంది, 'మీ అభిప్రాయాలు మా మామయ్యకు చాలా నచ్చాయట. అతని ప్రోత్సాహంతోనే నేను ఇంటర్వ్యూకు వచ్చాను. జీవితాంతం కలిసి మెలిసి బ్రతకాల్సిన స్త్రీ పురుషులు పెళ్ళి చేసుకునే ముందే బాగా ఆలోచించాలని మీరు కూడా భావిస్తారనుకుంటాను. మీ నిర్ణయం ఏదైనా ఈ అడ్రసుకు వ్రాసి తెలియజెయ్యండి' అని చెప్పి వెళ్ళిపోయింది.

మరో అమ్మాయి లోనికి ప్రవేశించింది. ఆ అమ్మాయి ఇద్దరు వ్యక్తులంత భారీ శరీరం కలిగివుంది. ఆ అమ్మాయి వస్తూనే 'నమస్కారమండీ' అంటూ చిరునవ్వు నవ్వింది.

'మీ పేరు?' బహువచనంలో అడిగాడు లాయర్.

'మంగమ్మ'

'ఎన్నాళ్ళ క్రితం చనిపోయారు మీ తలిదండ్రులు'

ఆమె క్షణమాలోచించి చెప్పింది 'మూడు సంవత్సరాలకు నాలుగు నెలలు తక్కువ'

'ఏమైనా చదువుకున్నారా?'

'ఆఁ! ఏదో చదివాను లెండి, నానాకాలపు చదువు'

'ఎందువల్ల చదువలేకపోయారు. ఆర్థిక కారణలేనా?'

'కాదు. నేను తెలివిగా చదివితే మా నాన్న పెద్ద పెద్ద చదువులే చదివించేవారు'

'మీ నాన్న ఏం పనిచేసేవారు?' కుతూహలంగా అడిగాడు లాయర్,

'మా నాన్న పనిచేయడమేమిటండీ! వాళ్లు పని చేస్తూవుంటే చూస్తూవుండేవారు'

లాయర్ సంతోషంతో అన్నాడు 'ఇప్పుడు మీ వ్యవసాయాన్ని ఎవరు చేయిస్తున్నారు?'

మంగమ్మ ఓసారి గుమ్మం వైపు చూచి చిన్నకంఠంతో చెప్పింది 'ఇల్లు తప్ప పొలాలన్ని అప్పులవాళ్ళు స్వాధీనం చేసుకున్నారు'

లాయర్ బాధగా ముఖం పెట్టి ఏదో అనబోయాడు, ఆమె అడ్డువచ్చి చెప్పింది. 'కాని అవి నిజమైన అప్పులు కావు. దొంగ ప్రామిసరీ నోట్లు సృష్టించి దొంగ పథకలు నా ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు.

ఆ తర్వాత ఇంకేదైనా అడిగి తెలుసుకోవాలన్న ఆసక్తి లేకుండా పోయింది లాయర్‌కు.

'మీరు నన్ను పెళ్ళి చేసుకుంటే...మీరు లాయర్ కదా! నా ఆస్తినంతా మళ్ళీ మనం స్వాధీనం చేసుకోవచ్చు' లాయర్ బుర్ర చకచకా ఆలోచించింది. అతడామె ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నాడు 'పెళ్ళికి మీరు తొందర పడుతున్నారా?'

ఆమె సిగ్గుతో తలవంచుకొని అంది 'అబ్బే... పెళ్ళికి పెళ్ళికి నాకేం తొందర లేదండీ. కాని ఈ కేసు మీరే నడిపించాలి'

'నడిపిస్తాను. గెలిపిస్తాను. ఫీజు మాత్రం ముందుగా ఇచ్చుకోవాలి'

'నన్ను పెళ్ళి చేసుకోవడానికి మీరు ఇష్టపడుతున్నారా లేదా?'

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రం బాధ్యులు కాదు.

—సంపాదకుడు.

మన్నికకు, అహ్లాదానికి...
పంజు టెక్స్ వారి
* మాస్టర్ * ఫాంటెక్స్
ఫైన్ బనియన్లనే వాడండి.
ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్ పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

'మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడానికి నేనెందుకు అయిష్ట పడుతాను.''

'అయితే ఫీజెందుకు?'

'ఇది నా వృత్తి ధర్మం. మీరు నాకు ఫీజు ఇచ్చినా మనం పెళ్ళిచేసుకుంటే మనకే వుంటుంది కదా!'

'నా దగ్గర డబ్బు లేకపోవడంవల్లనే కదా......' మంగమ్మ యింకా ఏదో చెప్పబోయింది.

'నెక్ట్' అన్నాడు లాయర్!

మంగమ్మ గది దాటి వెళ్ళడంతోటే మరో అమ్మాయి లోనికి ప్రవేశించింది.

ప్రకాశం ఆమెను రెప్పవాల్చకుండా చూశాడు. ఆమె అందగత్తె కాకపోయినా అందంగా అలంకరించుకోవడంవల్ల అందంగానే వుందనిపించింది. పొడవు కాదు, పొట్టి అనడానికి వీల్లేదు. బరువులేదు. బక్కపల్చగా లేదు. కళ్ళు బాగున్నాయి. ముక్కు బాగుంది. చదువు, సంస్కారం వున్నట్లే కనబడుతోంది. వయస్సు మాత్రం పాతిక సంవత్సరాలు దాటినట్లే వుంది.

ప్రకాశం ఆమె మెడలోని నెక్లెసు వైపు, చేతులకున్న బంగారు గాజులవైపు వ్రేళ్ళకున్న బంగారు వుంగరాలవైపు, చేతికున్న గడియారంవైపు చాలా ఆసక్తిగా చూచి చివరికి ఆమె కళ్ళమీద చూపు నిలిపి అడిగాడు 'మీరు ఇంతవరకు పెళ్ళిచేసుకోకపోవడానికి కారణం?'

'నాకు నచ్చినవాడు దొరకలేదు.'

'ఆమె సమాధానం చెప్పకుండా ఆకర్షణీయంగా నవ్వింది.

ప్రకాశానికి అంతా బాగానే వున్నట్టు అనిపించింది. ఈ అమ్మాయినే సెలెక్ట్ చేసుకుందామా అనుకున్నాడు. మళ్ళీ ఏదో అనుమానం వచ్చింది లాయర్ బుర్రకు— పాతికేళ్ళదాకా ఈవిడ పవిత్రంగా వుండగలిగిందా? అతడు హఠాత్తుగా అడిగాడు. 'నువ్వు ఎక్కడ పెరిగావు?' మీరులోంచి నువ్వులోకి మారింది మాట. అది ఆమె గమనించిందో లేదో కాని. 'మా ఇంటిలోనే' అంటూ జవాబిచ్చింది.

'అది సరే నిన్ను ఎవరు పెంచి పెద్దచేశారు?'

'మా అమ్మే!'

'మరి మీ అమ్మ...'



'రెండేళ్ళ క్రితమే చనిపోయింది.'

'అప్పటినుండి ఎవరిదగ్గర వుంటున్నావు.'

'ఎవరి దగ్గర వుండడమేమిటి? నాకు నలుగురు అన్నయ్యలు. అయిదుగురు అక్కయ్యలుకూడా వున్నారు. అక్కల్లో ముగ్గురికి పెళ్ళయింది. మరో యిద్దరికి పెళ్ళి నిశ్చయమైంది. వరకట్నంకోసం పదెకరాల భూమి అమ్మడానికి సిద్ధంగా వున్నారు అన్నయ్యలు.'

'వరకట్నం క్రిందికి ఇంట్లోవున్న నగలు పెట్టొచ్చుగా అమ్మడమెందుకు?

'మా ఇంట్లో నగలున్నాయని మీకెవరు చెప్పారు?'

'నువ్వు ధరించిన...'

ఆమె నవ్వి చెప్పింది. 'ఈ నెక్లెసు మా చిన్నమ్మది. ఈ గాజులు, ఉంగరాలు మా మేనమామవి, ఈ గడియారం మా పెద్దక్కది.'

అయితే మీరు నగలు చేయించుకోలేదన్నమాట.'

'ఎలా చేయించుకొమ్మంటారు చెప్పండి? ముప్పై ఎకరాల భూమి వుందన్నమాటేగానీ అందులో ఓ మాదిరిగా పంటపండే భూమి ఏడెనిమిది ఎకరాలకు మించి వుండదు. ఖర్చులకు మాత్రం లెక్కలేదు.'

లాయర్ బుర్రకు అంతా అర్థమైపోయింది.

'అమ్మో ఒప్పుకున్నాను కాదు. ఆమె పవిత్రత మాట ఎలావున్నా...ముప్పై ఎకరాలభూమి పదిమంది'

'ఏమిటి ఆలోచిస్తున్నారు?' అందామె హఠాత్తుగా.

అతడు ఆమె కళ్ళలోకి లోతుగా చూచి అన్నాడు. 'సాయంత్రం ఆరు గంటల తర్వాత వచ్చి కలుస్తావా నువ్వు? అలా వీలవుతుందా నీకు? వీలైతే...'

'సాయంత్రాల్లోనూ, రాత్రుల్లోనూ నేనెవరినీ కలుసుకోవడానికి వీలుండదండి. మీ అభిప్రాయం ఏదైనా ఈ అడ్రసుకు తెలియజేయండి' అని చెప్పి అడ్రసు కాగితం ఇచ్చి వెళ్ళిపోయింది.

సాయంత్రం నాలుగు గంటల దాకా ఇంటర్వ్యూలు కొనసాగింది.

• • •

అర్చన బి.ఏ. చదువుతుండగా ఆమె తలిదండ్రులు ఇద్దరు తమ్ముళ్ళు కారు ప్రమాదంలో చనిపోయారు,




మా వద్ద...

"టర్కీస్ డాక్టర్"

♦ ఫైన్ జెట్టి. ♦ పోలింగ్ అయిలెట్.

♦ ఇంటర్ లాక్. ♦ ఫేన్సీరకాలు.

రీసైజు, అన్ని విధములైన బనియన్లు,

అన్ని రకాలలోనూ దొరకును.

★

ఆర్డర్లను వెంటనే గమనించి పంపబడును.

**Turkey Knittings**

**D-94 (I), Lakshmi Nagar**

**TIRUPUR-638 602**


ఆనాటినుండి పెత్తండ్రి అనంతయ్యే ఆమెకు పెద్ద దిక్కు అయ్యాడు. ఆయనకు పిల్లలు లేరు. తమ్ముని కుమార్తెనే దత్తు తీసుకోవాలని ఇన్నాళ్ళూ అనుకున్నాడాయన.

అర్చనకు అన్నివిధాలా తగినవానితో పెళ్ళిచేసి శేష జీవితం అర్చన చెంతనే గడపాలని ఈ మధ్యనే నిర్ణయించుకున్నారు అనంతయ్య అతని భార్య చంద్రమ్మ.

అందం, సంస్కారం, మాట నేర్పరితనం, ఎదుటి వాళ్ళ మనస్తత్వం గ్రహించే నేర్పు, ఓర్పు, స్వతంత్ర వ్యక్తిత్వం ఇవన్నీ వున్నాయి అర్చనలో.

ఆ రోజు అర్చన ఇంటికి వచ్చాడు లాయర్ ప్రకాశం.

అర్చన అతన్ని మర్యాదగా లోనికి ఆహ్వానించింది.

ప్రకాశం పడక్కుర్చీలో కూర్చుండి అర్చనవైపు చిరునవ్వు ముఖంతో చూస్తూ అన్నాడు. 'జగదీశ్వర్ మీకు అన్నీ చెప్పేవుంటాడు. అయినా నేను స్వయంగా మీతో మాట్లాడాలని వచ్చాను.'

'మాట్లాడండి'

ప్రకాశం యుక్తిగా తన చదువు వివరాలు మొదలు కొని కుటుంబ ఆర్థిక వివరాలవరకు ఎన్నో విషయాలు చెప్పాడు. ఇంకా తన తాతముత్తాలు చేసిన ఘన కార్యాలు–చేసిన సంఘసేవ గూర్చి వివరించి చెప్పాడు, చివరికి అన్నాడు. 'చదువు, సంస్కారం, అందంవున్న అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను.'

'వరకట్నం తీసుకోకుండా తలిదండ్రులు లేని అమ్మాయిని పెళ్ళిచేసుకుంటానని పేపర్లో మీరిచ్చిన ప్రకటన చూశాను నేను.'

నవ్వాడు లాయర్.

'మీ రిచ్చిన ప్రకటనచూచి ఎవరైనా మీ వద్దకు వచ్చారా?'

'చాలామంది అమ్మాయిలు వచ్చారు. కాని వాళ్ళు నాకు నచ్చలేదు.'

'ఆ ప్రకటన ఉద్దేశమేమిటో వివరించి చెప్పగలరా?'

'మీకు తెలుసుకోవాలని కుతూహలంగా వుంటే మరెప్పుడైనా చెప్తాను'

అర్చన సంభాషణ పొడిగించడానికి ఇష్టపడని దానిలా మౌనంగా కూర్చుంది.

లాయర్ మృదువైన కంఠస్వరంతో మెల్లగా అన్నాడు 'మీరు... నాకు చాలా నచ్చారు మీరు అంగీకరిస్తే పెళ్ళిచేసుకోవచ్చు.'

'నేనెందుకు నచ్చానో తెలియజేయగలరా?'

'మీకు చదువువుంది, సంస్కారంవుంది, తెలివివుంది. వీటన్నింటినీ మించిన మంచి మనస్సు వుంది.'

'అని ఎవరు చెప్పారు మీకు?'

ఎల్లప్పుడూ......
టి. ఎన్. హెచ్. వారి
* సైనిక్స్ * ఆర్. ఓ.
కలర్ బనిన్లనే
ఉపయోగించండి.

ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

'చాలామంది మీ గురించి చెప్పగా విన్నాను. మీ పెళ్ళి మీ యిష్టానుసారంగా జరిపించడానికి మీ పెద్ద నాన్నగారు సిద్ధంగా వున్నారని కూడా తెలుసుకున్నాను. ఇక్కడికి వచ్చేముందు మీ పెద్దనాన్న గారితో మాట్లాడి వచ్చాను. నీకు యిష్టమైతే వారికి ఏ అభ్యంతరం లేదన్నారు.

'మీ గురించి మా స్నేహితురాలు చెప్పగా నేను కూడా విన్నాననుకోండి.'

'మీ స్నేహితురాలా! ఎవరామె?' కుతూహలంగా అడిగాడు లాయర్.

'అందం, సంస్కారం, మంచి మనస్సు అన్నీ వుండి, తల్లిదండ్రులులేక దిక్కులేక మీ పెళ్ళి ఇంటర్వ్యూకు హాజరైన అమ్మాయి ఒకామె.'

లాయర్ కృత్రిమంగా నవ్వి అడిగాడు, 'ఏం చెప్పిందామె.

'మీరు...తల్లిదండ్రులు లేని అమ్మాయిలను చూచి చాలా జాలిపడుతారట! మీరు చాలా తెలివైనవారట. మీ నాన్నగారిలో వున్నట్టు మీలో కూడా సంఘసేవా భావాలు చాలా వున్నాయట!'

లాయర్ ముఖం ప్రసన్నం అయింది.

'అయితే నేను మీకు నచ్చానని భావించవచ్చునా?'

'చెప్పమంటారా?'

'చెప్పండి!'

'సంఘసేవచేసే వంశంలో పుట్టిన మీరు నాకు చాలా నచ్చలేదు.'

లాయర్ ముఖం అప్పుడు చూడాలి 'వస్తా' అంటూ వెళ్ళిపోయాడు.

రాత్రి భోజనం చేస్తుండగా పెత్తండ్రికి పెరుగు వడ్డిస్తూ చెప్పింది, 'పెదనాన్నా! నేను పెళ్ళిచేసుకోవడానికి......'

ఆమెమాట పూర్తికాకముందే సంతోషంగా అడిగాడు అనంతయ్య, 'ఎవరిని? మాజీ ఎం. ఎల్. ఏ. గారి కుమారుడు లాయర్ ప్రకాశంగారినేనా?'

'ఆయన మాట ఎత్తకండి నిజాయితీ లేని మనిషి. డబ్బుఆశ లేనట్టు నటిస్తూ అక్రమ మార్గాల్లో యుక్తిగా డబ్బు సంపాదించే వారి వంశంలో పుట్టాడాయన. ఇలాంటివారంటే నాకు చాలా చెడ్డ అభిప్రాయంవుంది. నన్ను ప్రేమించే వ్యక్తి, నా అభిప్రాయాలను గౌరవించే వ్యక్తి ప్రభాకరం...అతన్నే పెళ్ళిచేసుకుంటాను.'

'నీ నిర్ణయాన్ని అభినందిస్తున్నానమ్మా! ప్రభాకరం మనస్తత్వం, వ్యక్తిత్వం నాకూ నచ్చాయి' అన్నాడు అనంతయ్య ఆనందంతో.

(సంపూర్ణం)



అభినేత్రి సుహాసిని